ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 13 ఆగస్టు 2025



పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏమైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017



నెడుమారన్, డాక్టర్ కరణ్‌సింగ్‌కు అవార్డులు ప్రదానం చేస్తున్న వెంకయ్యనాయుడు, వీఐటీ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ తదితరులు

చెళియన్ సోదరుల సేవలు
చిరస్మరణీయం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

వీఐటీ చెన్నైలో ఘనంగా అవార్డు వేడుకలు

ప్యారీస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యేగా, మంత్రిగా, తాత్కాలిక ముఖ్యమంత్రిగా వ్యవహరించిన డాక్టర్ నావలర్ నెడుంజెళియన్, సీనియర్ పార్లమెంటేరియన్‌గా ఇరా చెళియన్ల సేవలు చిరస్మరణీయమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కొనియాడారు. వీఐటీ చెన్నై ప్రాంగణంలో మంగళవారం ఉదయం నావలర్-చెళియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2025వ సంవత్సరానికి సంబంధించి డాక్టర్ నావలర్-ఇరాచెళియన్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. అతిథుల జ్యోతిప్రజ్వలన అనంతరం వీఐటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీ సెల్వం స్వాగతోపన్యాసంలో ముఖ్యఅతిథి, అవార్డు గ్రహీతలను సభకు పరిచయం చేశారు. వీఐటీ ఫౌండర్ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు డాక్టర్ నావలర్ అవార్డును మాజీ ఎమ్మెల్యే పలానెడుమారన్‌కు, ఇరాచెళియన్ అవార్డును కేంద్ర విద్యాశాఖ మాజీమంత్రి, జమ్మూకాశ్మీర్ మాజీ గవర్నర్ డాక్టర్ కరణ్‌సింగ్‌కు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ వీఐటీ ఉన్నత విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.విశ్వనాథన్ కూడా ఎమ్మెల్యే, ఎంపీగా ప్రజా సేవలో పాల్గొని ప్రస్తుతం విద్యావేత్తగా విద్యార్థులను మంచి పౌరులుగా దేశానికి అందిస్తున్నారని కొనియాడారు. తమిళనాట అన్నాదురై, కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత ప్రభుత్వంలో మంత్రిగా, మూడు సార్లు తాత్కాలిక ముఖ్యమంత్రిగా నావలర్ వ్యవహరించి రాజకీయాల్లో తనదైన ముద్రవేసారని, అలాగే ఆయన సోదరుడు ఇరా చెళియన్ కూడా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం వహించారని కొనియాడారు. వీరి పేరుతో ఏర్పాటు చేసిన అవార్డుల కార్యక్రమానికి తాను ముఖ్యఅతిథిగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. భారత దేశ అంతర్గత వ్యవహారంలో విదేశీయులు జోక్యం కలగజేసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ఏ దేశం నుంచి ఏమి కొనుగోలు చేయాలో ఇండియా నిర్ణయం తీసుకుంటుందన్నారు. దేశ ప్రజల నిర్ణయాలను ప్రధాని నరేంద్రమోదీ ఆచరణలో పెడుతున్నారని, ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ బలాన్ని ప్రపంచ దేశాలకు మోదీ తెలియజేశారన్నారు. ముందుగా డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ, నావలర్-ఇరాచెళియన్ సోదరులు తమ జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారని, వారి కీర్తిప్రతిష్ఠలను నేటి తరాలకు తెలియజేయాలనే ఆశయంతో వారి పేరుతో ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు ఆర్.వీరమణి, విమలా సుబ్బయ్య, మాజీమంత్రి నల్లుస్వామి, జస్టిస్ జ్ఞానప్రకాశం, డాక్టర్ వి.జానకి రామన్ తదితరులు పాల్గొన్నారు.

'ముదలమచ్చరిన్ తాయుమానవర్'

వృద్ధులు, దివ్యాంగుల
ఇళ్లవద్దకే రేషన్

- తండయార్‌పేటలో కొత్త పథకాన్ని ప్రారంభించిన సీఎం స్టాలిన్



తండయార్‌పేట గోపాల్‌నగర్‌లో ఓ వృద్ధురాలికి రేషన్‌సరుకులిచ్చి ఆమెతో మాట్లాడుతున్న సీఎం

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగులకు వారిళ్ల వద్దే రేషన్ సరకులందించేలా రూపొందించిన 'ముదలమచ్చరిన్ తాయుమానవర్ పథకం' అట్టహాసంగా ప్రారంభమైంది. తండయార్‌పేటలో మంగళవారం ఉదయం ఈ పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించి, ప్రాంతంలో నివసిస్తున్న వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి నెలవారి రేషన్ సరకులు అందజేశారు. అంతకు ముందు ఆయన ఈ పథకాన్ని అమలుచేసేందుకు రేషన్ సరకుల లోడుతో బయలుదేరిన వ్యాన్లకు పచ్చ జెండా ఊపారు. తండయార్‌పేట గోపాల్‌నగర్, అన్నై సత్యానగర్‌లో వృద్ధులు, దివ్యాంగులు నివసిస్తున్న ఇళ్లకే స్టాలిన్ వెళ్లి రేషన్ సరకుల సంచులను అందజేసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రిని దివ్యాంగులు, వృద్ధులు అభినందించారు. ఈ కొత్త పథకం ద్వారా ప్రతినెలా రెండో శని, ఆదివారాల్లో వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్ సిబ్బంది సరకులను అందజేయనున్నారని స్టాలిన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20,42,657 మంది వృద్ధులు, 1,27,797 మంంది దివ్యాంగులు సహా మొత్తం 21,70,454 మంది లబ్ధిదారులకు రేషన్ సిబ్బంది ప్రతినెలా రేషన్ సరకులను వారిళ్లవద్దకే సరఫరా చేయనున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, శాసనసభ్యులు జేజే ఎబినేజర్ ఇరా మూర్తి, ఆర్డీ శేఖర్, తాయగం కవి, జోసెఫ్‌సామువేల్, ఎ.వెట్రి అళగన్, కేపీ శంకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందనం, సహకార ఆహార వినియోగదారుల భద్రతా శాఖ ముఖ్యకార్యదర్శి సత్యప్రసాద్ సాహు, సహకార సంఘాల రిజిస్ట్రార్ కే నందకుమార్, రాష్ట్ర వినియోగ వస్తువుల వాణిజ్య మండలి ఎండీ ఎ.జాన్ లూయిస్, ఆహార పదార్థాల పంపిణీ వినియోగదారుల భద్రతా విభాగం డైరెక్టర్ ఎస్.శివరాసు, ప్రభుత్వ గిడ్డంగుల సంస్థ చైర్మన్ పి. రంగనాథన్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల పిల్లలకు ఆర్థిక సాయం...

సచివాలయంలో మంగళవారం ఉదయం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలో ఏక కాల పూజలు మాత్రమే జరిగే ఆలయాల్లో పనిచేసే అర్చకుల పిల్లల ఉన్నత చదువుల కోసం రూ.60లక్షల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు. అర్చకుల పిల్లలు 600మంది విద్యార్థులకు తలా రూ.10వేల చొప్పున చెక్కులను అందజేశారు. అదే విధంగా టీఎన్‌పీఎస్సీ పోటీ పరీక్షల ద్వారా డిప్యూటీ కమిషనర్లుగా ఎంపికైన 21 మందికి కూడా ఆయన నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, రాష్ట్ర పర్యాటక సంస్కృతీ దేవాదాయ శాఖల అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, అదనపు కమిషనర్ సి పళని తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరులో సీఎం స్టాలిన్ విదేశీ పర్యటన

రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు పెట్టుబడుల కోసం ముఖ్యమంత్రి స్టాలిన్, సెప్టెంబరు మొదటి వారంలో విదేశాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... రాష్ట్రంలో 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఆ ప్రకారం, సీఎం స్టాలిన్ ఇప్పటివరకు ఎమిరేట్స్, సింగపూర్, జపాన్, స్పెయిన్, అమెరికా తదితర దేశాల్లో పర్యటించి సుమారు రూ.18,498 కోట్ల మేర పరిశ్రమలకు సంబంధించిన ఒప్పందాలు పూర్తిచేసి, వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో, సీఎం స్టాలిన్ మళ్లీ ఈ నెల 31వ తేది నుంచి సెప్టెంబరు 10వ తేది వరకు ఇంగ్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటిస్తారని, పర్యటన రూట్ మ్యాప్ త్వరలో విడుదల చేయనున్నట్లు సచివాలయం తన ప్రకటనలో తెలిపింది.





రేషన్ సరుకుల వ్యాన్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

సీఎందే తుది నిర్ణయం



- పారిశుధ్య కార్మికుల పర్మినెంట్ అంశంపై మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయతీల్లో పని చేస్తున్న తాత్కాలిక పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయడంపై ముఖ్యమంత్రి స్టాలిన్‌దే తుది నిర్ణయమని పురపాలక, పరిపాలనా శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ స్పష్టంచేశారు. తిరుచ్చిలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, రేషన్ సరుకుల కోసం గతంలో ప్రజలు చౌకదుకాణాల ముందు వేచివున్న పరిస్థితిని ప్రస్తుతం ముఖ్యమంత్రి స్టాలిన్ మార్చి ఇంటివద్దకే రేషన్ సరుకులు అందజేసే పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. సుమారు 88వేల మందికి పైగా ఈ పథకం ద్వారా లబ్ధిపొందారని తెలిపారు. జీసీసీలో నిర్వధిక సమ్మె కొనసాగిస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులతో చర్యలు జరుపుతున్నామని, ఈ సమస్యను సున్నితంగా పరిష్కరింపజేసేందుకు సీఎం చర్యలు చేపట్టారన్నారు. జీసీసీ పారిశుధ్య కార్మికుల సమ్మెకు సంబంధించిన న్యాయస్థానంలో దాఖలైన కేసు తీర్పు వచ్చిన తరువాత ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్ణయం తీసుకుంటారని ఆయన వివరించారు. కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లు ఒక్కరోజులో పరిష్కరించడం సాధ్యంకాదని, వారి అవసరాలను తీర్చడంతో పాటు పర్మినెంట్ చేయడంపై సీఎం నిర్ణయిస్తారని మంత్రి పేర్కొన్నారు. వీధి కుక్కల బెడదలేకుండా వ్యవహరించాలని సుప్రీంకోర్టు మంచి తీర్పు ఇచ్చిందని, ఆ తీర్పు నకలు అందిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అమలుపరుస్తామన్నారు. ఆర్థిక పరిస్థితిని బట్టి ఒక్కోపథకాన్ని అమలుపరుస్తున్నామని, అయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపక్షాలు డీఎంకే ప్రభుత్వంపై బురదజల్లేలా అసత్యాలు ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు.



'సేవా వారం' సందర్భంగా పేదలకు విసనకర్రలు, తాటాకు చాపలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్ తదితరులు

ఓటమి భయంతోనే
కొత్త పథకాలు

- సీఎంస్టాలిన్‌పై నయినార్ నాగేంద్రన్ విమర్శలు

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసన సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి తుడిచిపెట్టుకుపోతుందన్న భయంతో ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ నోరు తిరగని పేర్లతో కొత్త పథకాలను ప్రారంభిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ధ్వజమెత్తారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం టి.నగర్ థామస్‌రోడ్డులో 'సేవావారం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన నిరుపేదలకు విసనకర్రలు, చేటలు, తాటాకుల చాపలను అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వినోజ్ పి.సెల్వం, జిల్లా శాఖ అధ్యక్షుడు గిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేంద్రన్ మాట్లాడుతూ ఈ యేడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఇంటింటా జరుపమంటూ బీజేపీ జాతీయ కమిటీ ఆదేశించిందని, ఆ మేరకు రాష్ట్రపార్టీ ఆధ్వర్యంలోనూ జెండా పండుగను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. సెప్టెంబర్ 2 వరకు ఈ వేడుకలను కొనసాగించాలని కూడా పార్టీ అధిష్టానవర్గం సూచించిందని చెప్పారు. దేశంలో చేతివృత్తి కళాకారులు తయారు చేసే వస్తువులను ఉపయోగించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు తాము సేవావారం కార్యక్రమంలో విసనకర్రలు, తాతాకుల చాపలను పేదలకు ఉచితంగా అందిస్తున్న తెలిపారు. కాగా రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని నాగేంద్రన్ విమర్శించారు. రాష్ట్రమంతటా విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని సింగపూరు నుండి తరలించిన రూ.7 కోట్ల గంజాయిని విమానాశ్రయంలో పట్టుకున్నారని తెలిపారు. డీఎంకే ప్రభుత్వం గత వారం రోజులుగా ప్రకటించిన పథకాలన్నీ నాలుగేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో అమలు చేయాల్సినవని, ఎన్నికల భయంతోనే స్టాలిన్ ఈ పథకాలను హడావుడిగా ప్రారంభిస్తున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ కూటమిలోకి మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్ సెల్వంను చేర్చుకునే విషయంపై సరైన సమయంలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని విలేఖరులడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

పంద్రాగస్టు భద్రతకు
లక్ష మంది పోలీసులు



తిరుచ్చి విమానాశ్రయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా రాష్ట్రమంతటా సుమారు లక్షమంది పోలీసులకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను భగ్నం చేయడానికి ఉగ్రవాదులు ప్రయత్నించే అవకాశాలున్నట్లు కేంద్రం నుండి అందిన సమాచారంతో రాజధాని నగరం చెన్నై సెయింట్ జార్జికోట,విమానాశ్రయం, ప్రముఖ నగరాల వద్ద పటిష్టమైన భద్రత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. చెన్నై నుంచి కన్నియాకుమారి వరకు అన్ని జిల్లాల్లోనూ భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేసినట్లు తెలిపారు. కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాట్లు కూడా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. చెన్నై నగరంలో సుమారు 10 వేలమంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు కమిషనర్ అరుణ్ తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే సెయింట్ జార్జి కోట వద్ద ఐదంచెల భద్రత కల్పిస్తామని చెప్పారు.

- పరువు హత్యకేసు

సుర్జిత్‌ను ప్రశ్నించిన పోలీసులు

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాళయంకోటలో జూలై 27న జరిగిన ఐటీ ఉద్యోగి కవిన్ పరువు హత్యకేసులో ప్రధాన నిందితుడైన సుర్జిత్‌ను కస్టడీలోకి తీసుకుని సీబీసీఐడీ విచారణ జరుపుతోంది. అగ్రకులానికి చెందిన తన సోదరిని ప్రేమించాడనే కోపంతో సుర్జిత్ నిమ్న కులానికి చెందిన కవిన్‌ను హతమార్చాడు. ఈ కేసులో సుర్జిత్‌ను, అతడిని పరువుహత్య దిశగా ప్రేరేపించారనే నేరారోపణపై ఎస్‌ఐలుగా పనిచేస్తున్న అతడి తల్లిదండ్రులపై సీబీసీఐడీ కేసు నమోదు చేసింది. మంగళవారం ఉదయం సీబీసీఐడీ తిరునల్వేలి డీఎస్పీ రాజ్‌కుమార్ నవరోజ్, మదురై డీఎస్పీ అరుణాచలం, సీఐలు ఉలగరాణి, పార్వతి, శేఖర్, సంతానలక్ష్మి తదితర అధికారులు విచారణ ప్రారంభించారు. సుర్జిత్ తండ్రి శరవణన్‌ను కూడా మరో గదిలో విచారించారు. సుర్జిత్‌ను పోలీసులు హత్యకు సంబంధించి ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో బుధవారం కవిన్ హత్యకు గురైన ప్రాంతం వద్ద సుర్జిత్, అతడి తండ్రి శరవణన్‌ను తీసుకెళ్లి విచారణ జరపాలని సీబీసీఐడీ అధికారులు భావిస్తున్నారు.



సుర్జిత్‌ను విచారణకు తీసుకెళ్తున్న పోలీసులు.



హత్యకు గురైన కవిన్ (ఫైల్‌ఫొటో)



సమావేశంలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

మా ప్రభుత్వం రాగానే
మీ సమస్యలు పరిష్కరిస్తాం

రైతులు, పారిశ్రామికవేత్తలతో ఈపీఎస్ భేటీ

ప్యారీస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది అన్నాడీఎంకే ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరింపజేస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి హామీ ఇచ్చారు. కృష్ణగిరి జిల్లా హోసూరులో మంగళవారం పారిశ్రామికవేత్తలు, ఉద్యానవన రైతులతో ఈపీఎస్ భేటీ అయ్యారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' అనే నినాదంలో పర్యటిస్తున్న ఈపీఎస్ మంగళవారం హోసూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చేరుకున్నారు. ఉదయం హోసూర్ బాగలూరు రోడ్డులో కృష్ణగిరి పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆ ప్రాంతంలోని చంద్రచూడేశ్వరాలయానికి వెళ్లి పూజలు చేశారు. ఆ తర్వాత ఓ కల్యాణ మండపంలో రైతులు, పారిశ్రామికవేత్తలతో ఈపీఎస్ సమావేశమయ్యారు. కృష్ణగిరి జిల్లాలో ట్రాఫిక్ సమస్య నివారించేలా తాను సీఎంగా ఉన్న సమయంలో సిక్స్‌లైన్ రోడ్డు పథకానికి 45 ఎకరాలు సేకరించామని, అయితే అధికారం మారిన తర్వాత ఈ పథకాన్ని డీఎంకే ప్రభుత్వ విస్మరించిందన్నారు. అదేవిధంగా వాణిజ్యపరంగా గుర్తింపు పొందిన హోసూరులో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 2026లో తమ ప్రభుత్వం రాగానే న్యాయం చేస్తామని ఈపీఎస్ హామీ ఇచ్చారు.

సమాచార ధ్వని

బీఈ, బీటెక్ ఉప కౌన్సెలింగ్ దరఖాస్తుల గడువు పొడిగింపు

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీఈ, బీటెక్ కోర్సుల ఉప కౌన్సెలింగ్‌కు దరఖాస్తు స్వీకరణ ఈ నెల 14వ తేది వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యా శాఖ మంత్రి కోవి చెళియన్ తెలిపారు. ఈ మేరకు మంత్రి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు, వృత్తి విద్యా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు, 2025-26 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేలా ఉప కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించామన్నారు. దరఖాస్తు సమర్పణ గడువు మంగళవారంతో ముగిసిన నేపథ్యంలో, తల్లిదండ్రులు, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు సమర్పణ గడువు గురువారం వరకు పొడిగించినట్లు, వివరాలకు 1800 425 0110 అనే టోల్‌ఫ్రీ నెంబరు సంప్రదించాలని మంత్రి తెలియజేశారు.

చారిత్రక సదస్సుకు పరిశోధన పత్రాల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాజేంద్ర చోళుడి చారిత్రక సదస్సుకు పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నారు. రాజేంద్ర చోళుడి కదర విజయానికి సహస్ర వార్షికోత్సవాలను పురస్కరించుకుని, ఆగ్నేయ ఆసియా విశ్వవిద్యాలయం, అంకోర్ తమిళ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రాజేంద్ర చోళ చరిత్ర సదస్సు నిర్వహించనున్నారు. నవంబరు 21 నుంచి 26వ తేది వరకు అంగోర్ వాట్ దేవాలయానికి సమీపంలో ఉన్న సీమ్ రీప్‌లో సదస్సు జరుగనుంది. ఈ సదస్సుకు పరిశోధనా పత్రాలు పంపేందుకు ఆసక్తి ఉన్న వారు angkorthamizh-sangamtn@gmail.cogm అనే ఈ-మెయిల్ చిరునామాకు సెప్టెంబరు 30వ తేదిలోపు పంపించాలి. మరిన్ని వివరాలకు 9489902060, +85581412179 అనే నెంబర్లు సంప్రదించవచ్చని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

గృహ సంరక్షణ ఉత్పత్తులపై శిక్షణ

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి, శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో గృహ సంరక్షణ ఉత్పత్తుల తయారీ శిక్షణ ఈ నెల 28 నుంచి 30వ తేది వరకు జరుగనుంది. శిక్షణలో, బ్లాక్ ఫినాయిల్, కటింగ్ ఆయిల్, గ్రీజ్, సోప్ ఆయిల్, కొళాయి శుభ్రం చేసే పౌడర్, నీటి తొట్టి శుభ్రం చేసే ద్రవం, డెటాల్, మెటల్ క్లీనింగ్ లిక్విడ్ తదితరాలు వివరించనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు పూర్తయిన వారు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, 8668102600 అనే నెంబరు సంప్రదించవచ్చని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

31న ప్రభుత్వ వైద్యుల నిరాహారదీక్ష

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో అప్రకటిత అత్యవసర పరిస్థితిని నిరసిస్తూ ప్రభుత్వ వైద్యులు ఈ నెల 31న నిరాహారదీక్ష చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ వైద్యుల సంఘాల సమాఖ్య విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన గిండి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, పెరియార్ ఆస్పత్రి, 50 పీహెచ్‌సీల్లో కొత్తగా ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా, ఇప్పటికే ఉన్న వైద్యులతో భర్తీ చేశారని ఆరోపించారు. ఈ కారణంగా వైద్యులపై పని భారం పెరిగి మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇవి ప్రభుత్వ వైద్యులకు అప్రకటిత అత్యవసర పరిస్థితిలా ఉందన్నారు. ఈ సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ రాజధాని నగరం చెన్నైలో ఈ నెల 31వ తేది నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు ప్రభుత్వ వైద్యుల సంఘాల సమాఖ్య ప్రకటించింది.

'పుదుమై పెణ్' పథకంలో 7 లక్షల మందికి లబ్ధి

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): 'పుదుమై పెణ్' పథకంలో 7 లక్షల మంది విద్యార్థినులు లబ్ధిపొందుతున్నట్లు ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... మహిళలు ఉన్నత విద్య అభ్యసించేలా 'పుదుమై పెణ్' పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ పథకంలో ఇప్పటివరకు 7 లక్షల మంది విద్యార్థినులు లబ్ధి పొందారని తెలిపారు. 'నాన్ ముదల్వన్' పథకం ద్వారా మూడేళ్లలో 41 లక్షల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో దేశంలోనే తమిళనాడు విద్యారంగంలో అగ్రగామిగా ఉందన్నారు. అలాగే, పీహెచ్‌డీ విద్యార్థులు కూడా రాష్ట్రంలో ఎక్కువని మంత్రి తెలిపారు.

టీవీకే మహానాడుకు పోలీసుల అనుమతి

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) మదురైలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడుకు పోలీసులు అనుమతించినట్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఆనంద్ తెలిపారు. టీవీకే రెండో మహానాడు ఈ నెల 25వ తేది జరుగుతుందని ప్రకటించగా, వినాయక చవితి సందర్భంగా వాయిదావేశారు. దానికి బదులు 21వ తేది మహానాడు నిర్వహించేందుకు అనుమతించాలని ఆ పార్టీ తరఫున పోలీసు శాఖకు వినతిపత్రం సమర్పించారు. మహానాడు నిర్వహించే ప్రాంతం, పాల్గొనే ప్రతినిధుల సంఖ్య, కార్యకర్తల వాహనాల పార్కింగ్, ఆహారం, తాగునీటి వసతి, సీసీ కెమెరాల ఏర్పాటు సహా 42 ప్రశ్నలపై పోలీసులు వివరణ కోరారు. మహానాడు ఏర్పాట్లపై పోలీసు శాఖకు వివరణ ఇచ్చిన నేపథ్యంలో, 21న మహానాడు నిర్వహణకు పోలీసు శాఖ అనుమతించిందని ఎన్.ఆనంద్ తెలిపారు.

వరుస సెలవుల నేపథ్యంలో ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం, వరుస సెలవుల సందర్భంగా నగరం నుంచి సొంతూళ్లకు వెళ్లే వారి సౌకర్యార్థం 2,449 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రోడ్డు రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు ఈ నెల 13న (బుధవారం) 375 బస్సులు, 14న 570 బస్సులు, 15, 16 తేదీల్లో తలా 375 బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు 14వ తేది 100 బస్సులు, 15న 90 బస్సులు, మాధవరం టెర్మినల్ నుంచి 14,15 తేదీల్లో 24 ప్రత్యేక బస్సుల చొప్పున నడుపనున్నారు. ఇక, సెలవుల తరువాత చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు 17వ తేది 751 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

రాష్ట్రంలో దశలవారీగా టాస్మాక్ దుకాణాల మూసివేత

● మంత్రి ఎస్.ముత్తుస్వామి



ప్యారీస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దశలవారీగా టాస్మాక్ మద్యం దుకాణాలను మూసివేయడంపై ప్రభుత్వం పరిశీలిస్తోందని గృహ, ఎక్సైజ్‌శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి పేర్కొన్నారు. ఈరోడ్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో టాస్మాక్ మద్యం చిల్లర దుకాణాలను పెంచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, ఈ నాలుగేళ్లలో 500 దుకాణాలు మూసివేసినట్లు మంత్రి తెలిపారు. టాస్మాక్ దుకాణాలు లేని ప్రాంతాల్లో కల్తీసారాయి, పొరుగురాష్ట్రాల నుంచి చట్టవిరుద్ధంగా తరలించే మద్యం విక్రయించకుండా అడ్డుకోవాలనే లక్ష్యంతోనే డీఎంకే ప్రభుత్వం టాస్మాక్ దుకాణాలను నడుపుతోందని తెలిపారు. టెట్రా ప్యాకెట్లలో మద్యం విక్రయించడంపై రాజకీయ పార్టీలు, ప్రజలు న్యాయస్థానం తెలిపే అభిప్రాయాన్ని బట్టి నిర్ణయం తీసుకుంటామన్నారు. మద్యం బాటిళ్లకు అదనంగా నగదు వసూలు చేసిన 451 మంది ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు.

తిరుత్తణి తెప్పోత్సవానికి తెప్పల తయారీ



తెప్ప సిద్ధం చేస్తున్న కార్మికులు

తిరుత్తణి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈ నెల 16వ తేదీ నిర్వహించబోయే తెప్పోత్సవానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం నుంచి మంగళవారం వరకు జరగనున్న ఈ వేడుకల్లో ముఖ్యమైన తెప్పోత్సవానికి సంబంధించిన పనులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నుంచి తెప్పల తయారీ ప్రారంభించారు. ఈ సందర్భంగా తెప్ప తయారు చేసే కార్మికులు మాట్లాడుతూ, వంశపారంపర్యంగా మురుగన్ ఆలయ తెప్పోత్సవానికి సంబంధించి తెప్ప నిర్మాణం పనుల్లో తాము పాల్గొంటున్నామని, స్వామివారి ఉత్సవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం తమ భాగ్యంగా భావిస్తున్నామని సంతోషం వ్యక్తంచేశారు. బుధవారం నాటికి తెప్ప కట్టు పనులు పూర్తవుతాయని కార్మికులు తెలిపారు.

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం జరుగనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరం వివరాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, మనలి మండలం 18వ డివిజన్ పరిధిలోని భారతీయార్ వీధి ఎస్ఆర్ఎఫ్ విద్యాలయపాఠశాల,తండయార్‌పేట మండలం 35వ డివిజన్ పరిధిలోని ముత్తుకుమారస్వామి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణం, తేనాంపేట మండలం 123వ డివిజన్ పరిధిలోని కేపీ దాసన్ రోడ్డులో ని కమ్యూనిటీ హాలు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగనున్నాయి. ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆయా ప్రాంతాల ప్రజలు శిబిరాల్లో పాల్గొని వినతిపత్రాలు సమర్పించవచ్చని జీసీసీ తెలియజేసింది.

ల్యాప్‌టాప్‌ల సరఫరాకు రెండు సంస్థల ఎంపిక

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న 20 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా ల్యాప్ లాప్ అందించేందుకు విడుదల చేసిన టెండర్లలో తక్కువ ధర కోడ్ చేసిన డెల్, ఏసర్ సంస్థలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఒక ల్యాప్‌టాప్ (15.6 ఇంచీల స్క్రీన్) ధర రూ.40,828గా డెల్ సంస్థ, రూ.23,385 ధరతో (14 ఇంచీల స్క్రీన్) ఏసర్ సంస్థలు టెండర్లు వేశాయి. ఈనెలాఖరుకు ల్యాప్‌టాప్ కొనుగోళ్లకు సంబంధించి ఒప్పందంకుదుర్చుకుంటామని అధికారులుతెలిపారు.

మురుగన్ హుండీ ఆదాయం రూ.9 లక్షలు

ప్యారీస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ హుండీ ఆదాయం రూ. 9 లక్షలకు పైగా వచ్చినట్టు అధికారులు తెలిపారు. గత 11 రోజులు భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ఆలయ సంయుక్త కమిషనర్ రమణి పర్యవేక్షణలో జరిగింది. రూ.9,49,806 నగదు, 165 గ్రాముల బంగారం, 6,460 గ్రాముల వెండి, విదేశీ డాలర్లు భక్తులు కానుకగా సమర్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

హిజ్రాను వివాహం చేసుకున్న యువతి



ఇలక్కియ, కార్తీక్

పెరంబూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా అరసిపాళయానికి చెందిన దురైరాజ్ కుమార్తె ఇలక్కియ శ్రీ (21) డిగ్రీ పూర్తిచేసింది. చెల్లాత్తమ్‌పట్టికి చెందిన శేఖర్ కుమారుడు కార్తీక్ (21) పాఠశాల స్థాయి నుంచే స్నేహితులు. ఇద్దరూ డిగ్రీ చేస్తున్న సమయంలో వారి పరిచయం ప్రేమగామారింది.వీరి ప్రేమవ్యవహారం ఇరు కుటుంబాలకు తెలిసి అభ్యంతరం చెప్పారు. దీంతో ఇద్దరూ సోమవారం ఈరోడ్ జిల్లా గోపిశెట్టిపాళయంలో ఉన్న కల్యాణ మండపంలో వివాహంచేసుకున్నారు. హిజ్రాను వివాహం చేసుకున్న యువతిని పలువురు అభినందించారు.

వైగై నదీజలాల కోసం ఉసిలంపట్టిలో బంద్



ఉసిలంపట్టిలో మూతపడిన దుకాణాలు

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా ఉసిలంపట్టి ప్రాంతానికి వైగై నదీ జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వ్యాపారులు బంద్ నిర్వహించారు. మంగళవారం ఉదయం నుండి ఉసిలంపట్టి చుట్టుపక్కల ప్రాంతాల దుకాణాలన్నీ మూసివేశారు. వాహనాల రాకపోకలను సైతం నిలిపివేశారు. వైగై జలాశయం నీటిమట్టం 69 అడుగులకు పెరిగినప్పుడు '58నెం గ్రామ కాలువలో సాగునీరు విడుదల చేయడం ఆనవాయితీ. ప్రస్తుతం వైగై డ్యామ్ నీటిమట్టం 69 అడుగులు దాటినా ఇరిగేషన్ అధికారులు ఇంకా నీరు విడుదల చేయకపోవడంతో ఉసిలంపట్టి చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలంతా ధర్నా చేశారు. ఈ విషయమై ఆందోళన కారులు మాట్లాడుతూ వైగై జలాశయం నుండి 58 నెంబర్ కాలువ ద్వారా విడుదలచేసే నీటితో సుమారు 925 హెక్టార్లలో సాగవుతుందని, తమ దాహార్తి కూడా తీరుతుందని తెలిపారు.

పులిని బంధించేందుకు కుంకీ ఏనుగులు



పులి సంచరించే ప్రాంతంలో కుంకీ ఏనుగులు

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో 13 పశువులను వేటాడిన పులిని బంధించేందుకు రెండు కుంకీ ఏనుగులను రప్పించారు. దేవర్‌సోలై, సర్కార్‌ముల్లై, పాడన్‌తోరై, చుట్టుపక్కల గ్రామాల్లోకి వస్తున్న పులి ప్రజలు పెంచుకునే పశువులను వేటాడుతోంది. పులిని బంధించి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ గ్రామస్తులు ఆందోళనలు చేపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతాలను పరిశీలించి, దేవర్‌సోలై, సర్కార్‌ముల్లై తదితర ప్రాంతాల్లో మూడు బోన్లు ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో, పులిని బంధించేందుకు ముదుమలై శరణాలయం నుంచి విజయ్, వసీం అనే రెండు కుంకీ ఏనుగులను రప్పించి, పులి జాడ కోసం గాలిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

● జెండా స్తంభాల వ్యవహారం...

హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

ప్యారీస్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):ప్రజలకు, వాహనాలకు ఇబ్బందికరంగా బహిరంగ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన రాజకీయ పార్టీల జెండా స్తంభాలను తొలగించాల్సిందేనంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. రాష్ట్రంలోని బహిరంగ ప్రాంతాల్లోవున్న రాజకీయ పార్టీల జెండా స్తంభాలను తొలగించాలని హైకోర్టు మదురై బెంచ్ చారిత్మాక తీర్పువెలువరించింది. న్యాయమూర్తి ఇళంద్రియన్ గత జనవరి 27వ తేదీ ఇచ్చిన ఈ తీర్పు కలకలంరేపింది.12 వారాల్లోగా జెండా స్తంభాలను తొలగించాలని, తొలగించే పనులకు సంబంధిత పార్టీల నుంచి నగదు వసూలు చేయాలని న్యాయమూర్తి ఇళంద్రియన్ ఆదేశించారు.ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ మద్రాస్ హైకోర్టులో దాఖలైన అపీలు పిటిషన్‌పై న్యాయమూర్తి నిషాభాను నేతృత్వంలోని బెంచ్ హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ మదురై అన్నాడీఎంకేకు చెందిన కదిరవన్ సుప్రీంకోర్టుకు అపీలుకు వెళ్లారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జేకే మహేశ్వరి, విజయ్ బిష్ణిలతో కూడిన బెంచ్ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనదేనని, ఈ తీర్పులో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరంలేదని స్పష్టంచేస్తూ ఉత్తర్వులిచ్చారు. బహిరంగ ప్రాంతాల్లో జెండా స్తంభాలు నాటే హక్కు ఎవరికీలేదని, ప్రజలకు ఇబ్బంది కలిగించే ఇలాంటి చర్యలను అనుమతించరాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది.

నేటినుంచి బీఎడ్ కోర్సుల సీట్ల కేటాయింపు

పెరంబూర్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి బీఎడ్‌సీట్ల కేటాయింపు ఉత్తర్వులు బుధవారం నుంచి పొందవచ్చు.ఈమేరకు ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని ఏడు ప్రభుత్వ విద్యా కళాశాలల్లో 700సీట్లు, 12 ఎయిడెడ్ విద్యా పాఠశాలల్లో 1,140 సీట్లున్నాయన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ ఆన్‌లైన్‌లో జూన్ 20 నుంచి జూలై 21వ తేది వరకు నిర్వహించామన్నారు. 559 మంది విద్యార్థులు, 2,986 మంది విద్యార్థినులు దరఖాస్తు చేయగా, జూలై 31న ర్యాంకుల జాబితా విడుదల చేశామని తెలిపారు. విద్యార్థులు కళాశాల ఎంపికకు ఈ నెల 4 నుంచి 9వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. ఈ నేపథ్యంలో, విద్యార్థులు తమ అడ్మిషన్ ఉత్తర్వులను టీటీటీ.జూటీజీట్బ్చి.జీ అనే వెబ్‌సైట్‌లో బుధవారం నుంచి పొంది, గురువారం నుంచి 19వ తేది వరకు సంబంధిత కళాశాల్లో చేరాలని సూచించారు. 20 నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని మంత్రి చెళియన్ తెలిపారు.

● టాస్మాక్‌లో తనిఖీల వ్యవహారం ..

ఈడీ చర్యలపై స్టే కొనసాగింపు

● సుప్రీంకోర్టు ఉత్తర్వు

అడయార్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ కార్యాలయాల్లో తనిఖీలు, తదుపరి చర్యలు చేపట్టకుండా గతంలో విధించిన తాత్కాలిక స్టే కొనసాగుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అదే సమయంలో ఈ నెల 18న టాస్మాక్ కేసు విచారణ జరుగనుంది. మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు 20కి పైగా టాస్మాక్ కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. టాస్మాక్ మద్యం దుకాణాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలకు సంబంధించి దాఖలైన అనేక కేసులను ఆధారంగా చేసుకుని ఈడీ ఈ సోదాలు చేసింది. ఈ తనిఖీల్లో రూ.1000 కోట్లకు పైగా అవినీతి జరిగిందని ఒక ప్రకటనలో పేర్కొంది. మరోవైపు, ఈ తనిఖీలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ఈ సోదాలను సమర్థిస్తూ, తదుపరి కూడా కొనసాగించవచ్చని ఈడీకి ఆదేశాలు జారీచేస్తూ, ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఏప్రిల్ 25న అప్పీల్ పిటిషన్ వేసింది. దీనిపై మే 22న విచారణ జరిపిన సుప్రీంకోర్టు... కౌంటర్ దాఖలు చేయాలని కోరుతూ, టాస్మాక్ కార్యాలయాల్లో తదుపరి ఎలాంటి సోదాలు చేయకుండా తాత్కాలిక స్టే విధించింది. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం ఎదుట ప్రభుత్వ న్యాయవాది హాజరై ఈ కేసు ఈ నెల 18వ తేదీన విచారణకు రానుందని, ఆ రోజున మళ్ళీ వాయిదా వేయకుండా విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఆ వినతిని స్వీకరించిన ధర్మాసనం ఈ నెల 18వ తేదీ వరకు తాత్కాలిక స్టే కొనసాగుతుందని పేర్కొంది.

ఎలుగు దాడిలో బాలుడి మృతి

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా వాల్పారై సమీపంలో ఎలుగు బంటి దాడిలో ఎనిమిదేళ్ల బాలుడు మృతిచెందాడు. వాల్పారై నీల్‌విళచ్చి ప్రాంతంలో నివశిస్తున్న ఉత్తరాది కార్మికులు ఆ ప్రాంతంలోని తేయాకు తోటల్లో పనులకు వెళ్తున్నారు. ఓ కార్మికుడి కుమారుడు నూర్ ఇస్లాం (8) మంగళవారం ఉదయం తన ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో పొదల మాటు నుంచి వచ్చిన ఎలుగుబంటి బాలుడిని నోట కరుచుకుని వెళ్లిపోయింది. బాలుడు కేకలతో తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు బాలుడి కోసం సమీపంలోని ప్రాంతాల్లో గాలించగా, ఓ పొదల మధ్య బాలుడి మృతదేహం లభ్యమైంది. గ్రామస్తుల సమాచారంతో అటవీ శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, వాల్పారై సమీపం పచ్చమలై ఎస్టేట్ ప్రాంతంలో జూలై నెలలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఏడేళ్ల బాలికను ఎలుగు బంటి హతమార్చింది. అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో బోను ఏర్పాటుచేసి ఎలుగు బంటిని బంధించి సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు. ఈ నేపథ్యంలో, మంగళవారం ఎలుగు బంటి దాడిలో బాలుడు మృతిచెందడంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

లైంగిక వేధింపుల కేసులో యువకుడికి జీవితఖైదు



వెంకటేశన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సమీపంలో నాలుగేళ్ల క్రితం గిరిజన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడికి తిరువళ్లూరు పోక్సో కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలో ఓ ప్రాంతానికి చెందిన 15 యేళ్ళ బాలికపై 2021లో వెంకటేశన్ (24) అనే యువకుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుత్తణి మహిళా పోలీసులు కేసు నమోదు చేసుకుని వెంకటేశన్‌ను అరెస్టు చేశారు. ఈ కేసును తిరువళ్లూరు పోక్సో కోర్టు మేజిస్ట్రేట్ ఉమామహేశ్వరి విచారణ జరిపారు. వెంకటేశన్‌పై అభియోగాలు సాక్ష్యాధారాలతో సహా రుజువుకావటంతో అతడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. దీనితో తిరుత్తణి మహిళా పోలీసులు దోషిని పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

హైకోర్టు భవనం నుంచి దూకి బాలిక ఆత్మహత్యాయత్నం

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడ్ వే సమీపంలోని మద్రాసు హైకోర్టు భవనం నుంచి దూకి బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఓ హత్యా కేసు విచారణకు నీలాంగరైకి చెందిన 15 ఏళ్ల బాలికను పోలీసులు మద్రాసు హైకోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఆదేశాలతో బాలికను జువైనల్ హోంకు తరలించేందుకు సిద్ధమయ్యారు. న్యాయస్థానం ఉత్తర్వులతో భయాందోళనలు చెందిన బాలిక, హైకోర్టు మొదటి అంతస్తు నుంచి కిందకు దూకింది. తీవ్రగాయాలపాలైన బాలికను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

విద్యుదాఘాతానికి బాలుడి మృతి

ప్యారీస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువేర్కాడులో విద్యుదాఘాతానికి గురై 11యేళ్ల బాలుడు మృతిచెందిన సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు తిరువేర్కాడు సుందరంవీధికి చెందిన కార్తిక్ కుమారుడు హరీష్ (11)ఆ ప్రాంతంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సుందరంవీధిలో పాడుబడిన ఓ ఇంటిప్రాంగణంలో స్నేహితులతో కలిసి ఆడుకున్న హరీష్ అక్కడున్న విద్యుత్ మోటారు స్విచ్ ఆన్ చేసేందుకు ప్రయత్నించగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై అందజేసిన ఫిర్యాదు మేరకు తిరువేర్కాడు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఊటీ ఎమ్మెల్యే కార్యాలయ ప్రాంగణంలో వృద్ధుడి మృతదేహం

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ ఎమ్మెల్యే కార్యాలయంలో వృద్ధుడి మృతదేహం లభించడం కలకలం రేపింది. ఊటీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌కు చెందిన గణేష్ వ్యవహరిస్తుండగా, ఊటీ తమిళనాడు హోటల్ రోడ్డులో ఎమ్మెల్యే కార్యాలయం ఉంది. సమస్యలు తెలిపేందుకు వచ్చే ప్రజలతో ఈ కార్యాలయం ప్రతిరోజు సందడిగా ఉంటుంది. వారాంతపు సెలవులు కావడంతో శని, ఆదివారాల్లో ఎమ్మెల్యే, సిబ్బంది రాలేదు. సోమవారం ఉదయం ఆ ప్రాంతంలో దుర్గంధం రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.. ఊటీ సీఐ శివకుమార్ నేతృత్వంలో పోలీసులు కార్యాలయానికి చేరుకుని పరిశీలించగా, 70 ఏళ్ల వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం కు తరలించి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాంబన్ లిఫ్ట్ వంతెనలో సాంకేతికలోపం

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం పాంబన్ లిఫ్ట్ వంతెనలో సాంకేతికలోపం కారణంగా రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. లిఫ్ట్ వంతెన పైకి లేపి తిరిగి యథాస్థానానికి తీసుకొచ్చే సమయంలో సాంకేతికలోపం తలెత్తింది. దీంతో, రామేశ్వరం నుంచి బయల్దేరాల్సిన రెండు రైళ్లను నిలిపివేశారు. సాంకేతికలోపాన్ని ఇంజనీరింగ్ నిపుణులు సరిదిద్దారు.

స్టార్‌హోటల్ యజమాని నివాసంలో సీబీఐ దాడులు

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరంలోని స్థానిక నుంగంబాక్కంకు చెందిన ఓ స్టార్ హోటల్ యజమాని పెరియస్వామికి చెందిన నివాసగృహం, కార్యాలయాలు, హోటళ్లలో సీబీఐ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. ఉదయం 7.20 గంటలకు ఆయన నివాసానికి చేరుకున్న ఆరుగురు సీబీఐ అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నారు. అదే విధంగా నామక్కల్‌లో ఆయన నడుపుతున్న విద్యా సంస్థలు, చెన్నై గిండీలోని ఓ నక్షత్ర హోటల్, కోయంబత్తూరులోని మరో హోటల్ ఇలా మొత్తం ఐదు ప్రాంతాల్లోని స్టార్ హోటళ్లలో ఆయన కార్యాలయాల్లో కూడా సోదాలు చేపట్టారు. ఈ సోదాలలో పన్నుల ఎగవేత తదితర అక్రమాలకు సంబంధించిన కీలకమైన దస్తావేజులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ సోదాలు ముగిసిన తర్వాత అధికారిక ప్రకటన విడుదల చేస్తామని సీబీఐ వర్గాలు పేర్కొన్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.


అడయార్: 3,4 మెయిన్ రోడ్డు గాంధీ నగర్, 2వ క్రీసెంట్ పార్క్ రోడ్డు.

కొట్టివాక్కం: జర్నలిస్ట్ కాలని, శ్రీనివాసపురం, న్యూ బీచ్ రోడ్డు, కావేరి నగర్ 1 నుంచి 6 వీధులు, కర్పగాంబాళ్ నగర్, లక్ష్మణ పెరుమాళ్ నగర్, తిరువళ్లువర్ నగర్ 1 నుంచి 59 వీధులు, భగత్ సింగ్ రోడ్డు, వెంకటేశ్వర నగర్ 1 నుంచి 21 వీధులు, న్యూ కాలని 1 నుంచి 4 వీధులు, కొట్టివాక్కం కుప్పం, భజన ఆలయ వీధి, ఈసీఆర్ మెయిన్ రోడ్డు, ముత్తీశ్వర ఆలయం, ఖజుర గార్డన్, పాల్‌కాలై నగర్, సౌత్, నార్త్ అండ్ ఈస్ట్ మాఢ వీధులు, పిళ్లయార్ ఆలయ వీధి, రాజా రంగస్వామి అవెన్యూ 1 నుంచి 4వ సీవార్డ్ రోడ్డు, బాలకృష్ణ హైరోడ్డు, వాల్మీకి నగర్, కళాక్షేత్ర రోడ్డు, సీజీఐ కాలని, పోలీసు క్వార్టర్స్, తిరువీధిఅమ్మన్ ఆలయ వీధి, సంగం కాలని, కామరాజర్ రోడ్డు, కందస్వామి నగర్, పాలవాక్కం.

తిరుముల్లైవాయల్: లక్ష్మీపురం, పెరియార్ నగర్, కోనిమేడు, గంగై నగర్, శరత్ కండిగై, పమ్మదుకుళం, ఎల్లయమ్మన్ పేట, ఈరాన్‌కుప్పం. **పంజెట్టి:** కావరపేట, కీలముదలంబేడు, మేల్‌ముదలంబేడు, సోంపట్టు, పనపాక్కం, ఆరణి, దురైనల్లూర్, చిన్నంబేడు, కరణి, పుదువాయల్, రాలాపాది, మంగళం. **పెరంబూర్:** హైరోడ్డు 1,2 వీధులు, మంగళాపురం, కృష్ణదాస్ రోడ్డు 1 నుంచి 5 వీధులు, దేశీయ కాలని, హౌసింగ్ బోర్డు, సీవైఎస్ రోడ్డు, సెమ్మాత్తమ్మన్ కాలని, మేట్టుపాళయం, శాంతి కాలని, పీహెచ్ రోడ్డు, న్యూ ఫెర్రాన్స్ రోడ్డు, స్ట్రాహన్స్ రోడ్డు, దర్గా వీధి, పెన్షనర్ లైన్, అప్పాస్వామి వీధి, యాహరాబ్ గార్డన్ వీధి, అలెగ్జాండర్ గార్డన్ వీధి, ఎస్ఎంఎస్ వీధి, నార్త్ టౌన్ 1,2, పెరంబూర్ బారాక్ రోడ్డు, పోలీసు క్వార్టర్స్, హంటర్స్ రోడ్డు, హంటర్స్ లైన్, రాంగిఅహ వీధి, రాఘవన్ వీధి, అష్టభుజనం రోడ్డు, కేఎం గార్డన్, నమ్మళ్వార్ వీధి, మాణిక్యం వీధి, మురుగేశ ముదాలి వీధి, నరసింహ పెరుమాళ్ ఆలయ వీధి, కాలాతిఅప్ప వీధి, థానా వీధి, ముత్తయ్యనాయకన్ వీధి, అరసప్పన్ వీధి, పెరుమాళ్ వీధి, కారియప్ప రోడ్డు, డెమెల్లోస్ రోడ్డు, రాజాసాహిబ్ వీధి, చిన్న తంబి మసూది వీధి, కార్పొరేషన్ లైన్ శివరావు రోడ్డు, వల్లం బంగారు వీధి, కుట్టి వీధి, ముత్తునాయకన్ వీధి, వెంకటేశ్వర భక్తన్ వీధి, సీఎస్ నగర్, సీఆర్ గార్డన్, సూరత్ భవన్ వీధి, ఎతిరాజ్ గార్డన్, రామానుజం గార్డన్, త్యాగప్ప ముదాలి వీధి, బాబు వీధి, బారక్స్ గేట్ వీధి, నైనియప్పన్ వీధి, ఎస్ఎస్ పురం ఏ, బి బ్లాక్, బ్రింక్లిన్ రోడ్డు, కామరాజ్ వీధి, నక్కీరన్ వీధి, తిరువిక వీధి.

ఇటుకల బట్టీలో యువకుడి హత్య

● ఉత్తరాది బాలికలు సహా ముగ్గురి అరెస్టు



ఇటుకల బట్టీ ప్రాంతం వద్ద ధర్నా చేస్తున్న శరవణన్ కుటుంబీకులు, స్థానికులు

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని సమీపం తుమ్మలపట్టి గ్రామంలో ఇటుకలబట్టీలో పనిచేస్తున్న యువకుడిని హత్య చేసిన ఇద్దరు బాలికలు, వారి తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ ఇటుకల బట్టీలో పనిచేస్తున్న శరవణన్ (23) అనే యువకుడు గత శనివారం రాత్రి శవంగా పడి ఉండగా గుర్తించారు. పోలీసులు ఈ కేసును అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారు. అదే సమయంలో శరవణన్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ అతడి కుటుంబీకులు, బంధువులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో పోలీసులు ఆ ఇటుకల బట్టీని సీసీ ఫుటేజీ పరిశీలించగా, ఆ బట్టీ వద్ద నివసిస్తున్న ఉత్తరాదికి చెందిన ఓ వ్యక్తి కుమార్తెలున్న గదిలోకి ఆ యువకుడు వెళ్ళి బయటకు రావడం కనిపించింది. దీంతో ఆ బాలికలను పోలీసులు విచారణ జరిపారు. వారు తెలిపిన వివరాలు మేరకు వారిలో ఓ బాలికను శరవణన్ ప్రేమించాడని, శనివారం రాత్రి ఆమెను ఒంటరిగా పొదలమాటుకు తీసికెళ్ళినప్పుడు ఆ బాలిక నెట్టడంతో అతడు వెల్లకిలా రాళ్ళపై పడ్డాడని, తలకు బలమైన గాయాలు తగలటంతో అక్కడికక్కడే మృతి చెందాడని వెల్లడైంది. దీనితో పోలీసులు హత్యకేసుగా నమోదు చేసుకుని ఆ బాలికల సహా అతడి తండ్రిని అరెస్టు చేశారు.



దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఓ అర్చకుడి కుమార్తెకు ఉన్నత చదువుల కోసం సచివాలయంలో రూ.10వేల చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఎయిర్ మార్షల్ తేజేందర్ సింగ్



ట్రిప్లికేన్‌లో 'తాయుమానవర్ పథకం' ప్రారంభించి ఓ ఇంటిలో వృద్ధులకు రేషన్ సరకులు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పాతకుట్రాలం జలపాతం వద్ద స్నానాల సమయం కుదింపు



పాతకుట్రాలం వద్ద స్నానమాచరిస్తున్న పర్యాటకులు

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాతకుట్రాలం జలపాతం వద్ద పర్యాటకుల సందర్శన సమయాన్ని తగ్గిస్తూ అటవీ శాఖ అధికారులు ఉత్తర్వు జారీ చేశారు. పాతకుట్రాలం జలపాతం వద్ద స్నానాలు చేసేందుకు దేశవిదేశాల నుండి వేల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తుంటారు. వీరిని ఆ ప్రాంతం వద్ద రోజూ ఉదయం ఆరు నుండి రాత్రి 8 గంటల దాకా స్నానమాచరించడానికి అనుమతించేవారు. ఇటీవలి కాలంలో పర్యాటకులు రాత్రి ఎనిమిది గంటల తర్వాత కూడా ఆ జలపాతం వద్ద స్నానం చేయసాగారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ ఉన్నతాధికారులు ఆ జలపాతాన్ని పర్యాటకులు సందర్శించే సమయాన్ని కుదించారు. ఆ ప్రకారం రోజూ ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకే పర్యాటకులు ఆ జలపాతం వద్ద స్నానమాచరించడానికి అనుమతిస్తారు. ఈ ఉత్తర్వు తక్షణమే అమలులోకి వచ్చిందని అధికారులు ప్రకటన జారీ చేశారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భవనాలు, చేపల లోడింగ్, అన్‌లోడింగ్ సెంటర్లను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

రూ.177.16 కోట్లతో మత్స్యశాఖ భవనాల ప్రారంభం

చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ.177.16 కోట్లతో నిర్మించిన భవనాలను, చేపల లోడింగ్, అన్‌లోడింగ్ సెంటర్లను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం ఉదయం ప్రారంభించారు. సచివాలయంలో ఆ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో కొత్తగా నిర్మించిన చేపల దిగుమతి కేంద్రాలు, చేపల సంతానోత్పత్తి కేంద్రాలు, శిక్షణా సంస్థతో కూడిన కార్యాలయ భవనం, పూర్తైన 9 పథకాలకు కూడా ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభోత్సవం చేశారు. రాష్ట్ర సిబ్బంది ఎంపిక సంస్థ పరీక్షలో ఉత్తీర్ణులైన 89 మందికి పాల ఉత్పత్తిదారుల సహకార సంస్థల్లో ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఇదే విధంగా పశుసంవర్ధక శాఖలో 22 మందికి నియామక ఉత్తర్వులు అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనితా ఆర్ రాధాకృష్ణన్, డి.మనో తంగరాజ్, పశు సంవర్ధక, మత్స్యశాఖ కార్యదర్శి ఎన్.సుబ్బయ్యన్, పశుసంవర్ధక శాఖ వైద్య సేవల విభాగం సంచాలకులు ఇరా కన్నన్, రాష్ట్ర పాల ఉత్పత్తిదారుల సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అన్నాదురై తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రామేశ్వరం జాలర్ల సమ్మె

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికా దళం దాడులు అడ్డుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ రామేశ్వరం జాలర్లు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. రామనాధపురం జిల్లా రామేశ్వరం నుంచి 61 రోజుల నిషేధ కాలం ముగియడంతో చేపట వేటకు వెళ్లిన జాలర్లు, సరిహద్దులు దాటారంటూ శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి, వారి పడవలను స్వాధీనం చేసుకుంటోంది. ఆ ప్రకారం గడిచిన 50 రోజుల్లోనే 55 మంది జాలర్లను లంక నావికాదళం అరెస్ట్ చేసి, వారి పడవలు స్వాధీనం చేసుకుంది. మితిమీరుతున్న లంక నావికాదళం దాడులు అరికట్టాలి, లంక జైళ్లలో ఉన్న జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలను విడిపించాలని కోరుతూ రామేశ్వరం, పరిసర గ్రామాల జాలర్లు చేపల వేట నిలిపి సోమవారం నుంచి సమ్మెకు దిగారు. ఈ కారణంగా సుమారు 700లకు పైగా పడవలు తీరానికే పరిమితమయ్యాయి.

తీరానికే పరిమితమైన పడవలు





విందు భోజనంలో పురుషులు

పురుషులు మాత్రమే పాల్గొనే ఆలయ విందు

పెరంబూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా నత్తం సమీపం పాదకుడిలో పొన్నార్ శంకర్ స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయ పురుషులు మాత్రమే పాల్గొనే వేడుకలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది వేడుకలు సోమవారం సాయంత్రం జరిగాయి. వ్రతం ఆచరించిన భక్తులు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయానికి మొక్కుబడిగా చెల్లించిన మేకలు, గొర్రెలు, కోళ్లను వధించి స్వామివారిని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం మాంసాహారంతో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 5వేల మంది పురుషులు పాల్గొన్నారు.

విజయవంతంగా టెలీసర్జరీ

అడయార్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారి టెలీసర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. చెన్నైకి దాదాపు 340 కిలోమీటర్ల దూరంలో ఉన్న సేలం నుంచి ఈ టెలీసర్జరీని సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశారు. ఇది దక్షిణ భారతదేశానికి ఒక మైలురాయిగా నిలువనుంది. ఈ చికిత్సను అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా తమిళనాడు చాప్టర్ వార్షిక సమావేశం టీఎన్ఏఎస్ఐసీఓఎన్ 2025లో భాగంగా సోమవారం నిర్వహించారు. క్లినికల్ లీడ్ డాక్టర్ పరిముత్తుకుమార్, సేలంలోని ధరణి హాస్పిటల్స్ నుంచి రిమోట్ విధానంలో వేళచ్చేరిలోని ప్రశాంత్ హాస్పిటల్‌లో ఉన్న రోగికి ఈ తొలి టెలీసర్జరీని రిమోట్ సర్జికల్ ప్రాక్టీస్‌లో భాగంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని టీఎన్ఏఎస్ఐ చైర్మన్ డాక్టర్ పి.సుందరరాజ్ అభినందించారు.



టెలీసర్జరీ పూర్తి చేసిన వైద్యబృందం

తిరుత్తణికి పోటెత్తిన భక్తులు



శ్రీవల్లీ,దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

తిరుత్తణి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆడి మంగళవారాన్ని పురస్కరించుకుని తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము 5 గంటల నుండే భక్తులు క్యూలైన్లలో వేచివుండి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. గురువారం నుంచి ఆడి కృత్తిక సందర్భంగా నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాలను నుండి భక్తులు కావళ్లతో ఆలయానికి పాదయాత్రగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో శరీరానికి శూలాలు గుచ్చుకున్న భక్తులు, కావళ్లతో వచ్చిన భక్తులంతా చేరి ఆటపాటలతో చిందులేసి సందడి చేశారు.



ఆలయ ప్రాంగణంలో కావళ్లతో భక్తుల సందడి

రెఫెక్స్ మొబిలిటీగా ఈవీల్జ్



రెఫెక్స్ మొబిలిటీ వాహనాన్ని పరిచయం చేస్తున్న అనిరుథ్ అరుణ్

ప్యారీస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్‌లకు ఎలక్ట్రిక్ మొబిలిటీ సొల్యూషన్స్ సహకారం అందిస్తున్న రెఫెక్స్ ఈవీల్జ్‌ను రెఫెక్స్ మొబిలిటీగా మార్పు చేసినట్లు ఆ సంస్థ సీఈవో అనిరుథ్ అరుణ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయన రెఫెక్స్ మొబిలిటీ వాహనాలను మీడియాకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులకు సురక్షిత, నమ్మకం, సామాజిక స్పృహతో కూడిన రవాణా సదుపాయాన్ని అందించడమే లక్ష్యంగా ఈవీలతో తమ సేవలను విస్తరింపజేస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌కేపీసీ విద్యార్థినుల ప్రతిభ

● ఈషా కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం



విజేతలతో పోటీ న్యాయనిర్ణేతలు

ప్యారీస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ)లో ఈషా అంతర్విభాగాల కల్చరల్ ఫెస్ట్ రెండ్రోజుల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రాంగణంలో పొగ రహిత వంటలు, ఆభరణాల తయారీ, రీల్ మేకింగ్, దండలు అల్లడం తదితర పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ కనబరిచి బహుమతులు సొంతం చేసుకున్నారు. ఎస్‌కేపీసీ ఐక్యూఏసీ, కళాలయ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ ప్రారంభించారు.

పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయాలి

● టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు



పారిశుధ్య కార్మికులకు మద్దతుగా నినాదాలు చేస్తున్న టామ్స్ నేతలు గొల్లపల్లి ఇశ్రాయేలు, విజయకుమార్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణ పనులను ప్రైవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ నిరవధిక సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయాలని తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయపురం, తిరువీకానగర్ కార్పొరేషన్ జోన్లలో చెత్తసేకరణ పనులకు సంబంధించి ప్రైవేటు సంస్థతో జీసీసీ రూ.276 కోట్లకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జోన్లలో పనిచేస్తున్న సుమారు 2వేల మందికి పైగా పారిశుధ్య కార్మికుల వేతనం రూ.23వేల నుంచి రూ.16వేలకు ఆ సంస్థ తగ్గించింది. తమ వేతనాన్ని పెంచాలి, పర్మినెంట్ చేయాలి, పించన్ తదితర రాయితీలు కల్పించాలన్న కోరికతో కార్మికులు జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 12వ రోజుకు చేరుకుంది. టామ్స్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర విభాగాలు ఈ కార్మికులకు మద్దతు ప్రటించాయి. సమ్మెలో పాల్గొన్న కార్మికుల సమస్యలను టామ్స్ నేతలు గొల్లపల్లి ఇశ్రాయేలు, నేలటూరి విజయకుమార్, రొడ్డా జయరాజ్, బీఎన్.బాలాజీ, శ్రీనివాసన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కర్రా లోకేష్‌కుమార్ తదితరులు అడిగి తెలుసుకున్నారు. 15యేళ్లుగా తాత్కాలిక పనిచేస్తున్న వీరిని పర్మినెంట్ చేయాలని, చెత్తసేకరణ నిమిత్తం ప్రైవేటీకరరణ రద్దు చేయాలని ఇశ్రాయేలు ప్రభుత్వాన్ని కోరారు.

పారిశుధ్య కార్మికులకు వ్యతిరేకం కాదు

● హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

అడయార్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందంటూ కొందరు తప్పుడు భావన వ్యాపింపజేస్తున్నారని మద్రాస్ హైకోర్టుకు ప్రభుత్వం తెలిపింది. జీసీసీ 5, 6 జోన్లలో పారిశుధ్య పనులు ప్రైవేటు సంస్థకు కాంట్రాక్టు ఇచ్చేలా నగర పాలక సంస్థ సమావేశంలో తీర్మానించారు. దీనికి వ్యతిరేకంగా 2 రోజులుగా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ఆందోళన చేస్తున్నారు. దీంతో నగర వాసులతో పాటు ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందంటూ న్యాయవాది వినోద్ మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాత్సవ, న్యాయమూర్తి సుందర మోహన్‌లతో కూడిన ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య కార్మికులు ఆందోళనకు చెప్పాకం, ఎగ్మోర్ రాజారత్నం స్టేడియంలో పోలీసులు అనుమతిచ్చారని, కానీ పారిశుధ్య కార్మికులు మాత్రం రిప్పన్ బిల్డింగ్ వద్ద ఆందోళన చేస్తున్నారని ప్రభుత్వ తరపు న్యాయవాది సమాధానమిన్నారు. ఈ వాదనలు ఆలకించిన ధర్మాసనం విచారణకు తేదీ నిర్ణయించకుండానే వాయిదా వేసింది.

29న 'నరువి' విడుదల



'నరువి'లో ఓ దృశ్యం

చిత్రజ్యోతి

హరీష్ సినిమాస్ సమర్పణలో ఏ.అళగు పాండియన్ నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ సుభారత్.ఎం దర్శకత్వంలో రూపొందిన 'నరువి' ఈ నెల 29న విడుదలకానుంది. గిరిజనుల కష్టనష్టాలను వివరించే హర్రర్ థ్రిల్లర్ మూవీగా తెరకెక్కించారు. నిర్మాణాంతర కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకున్న ఈ సినిమా గురించి నిర్మాత ఏ.అళగు పాండియన్ మాట్లాడుతూ, 'గిరిజనుల పిల్లల్లో విద్యపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మించాం' అని తెలిపారు. దర్శకుడు సుభారత్ మాట్లాడుతూ, 'అన్ని వర్గాల ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా సామాజిక సందేశాత్మక చిత్రంగా, రొమాంటిక్ కామెడీతో కూడిన హర్రర్ థ్రిల్లర్‌గా రూపొందించాం. వైద్య విద్య పూర్తి చేసి సమాజ సేవకు అంకితమైన డాక్టర్ హరీష్ ఇందులో ప్రధాన పాత్ర పోషించగా, ఇతర పాత్రల్లో విస్సు, విజే పప్పు, పతిని కుమార్, జీవా రవి, ప్రవీణ, మురుగానందం, ప్రదీప్, మదన్ ఎస్.రాజా తదితరులు నటించారు. చెన్నై, ఊటీ, కున్నూరు తదితర ప్రాంతాల్లో 60 రోజుల్లో షూటింగ్ పూర్తి చేసినట్టు వివరించారు.

ధనుష్‌తో ప్రేమ వ్యవహారమా?

● ఆ వార్తలు చూస్తుంటే నవ్వొస్తోంది

● మృణాల్ ఠాకూర్



కోలీవుడ్ అగ్రహీరో ధనుష్‌ను తాను ప్రేమిస్తున్నట్టు వస్తున్న వార్తలను చూస్తుంటే నవ్వొస్తుందని బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ అంటున్నారు. ఇటీవల ముంబైలో ఎంతో గ్రాండ్‌గా జరిగిన మృణాల్ పుట్టిన రోజు వేడుకలకు ధనుష్ ప్రత్యేకంగా హాజరుకావడం, ఆ పార్టీలో మృణాల్ - ధనుష్ సన్నిహితంగా మెలిగారు. దీంతో వీరిద్దరు ప్రేమలో మునిగి తేలుతున్నారంటూ ప్రచారం జరిగింది. ఈ వార్తలపై మృణాల్ తాజాగా స్పందించారు. 'నేను, ధనుష్ మంచి స్నేహితులం. మా మధ్య ఎలాంటి సంబంధం లేదు. 'సన్ ఆఫ్ సర్దార్-2' సినిమా కార్యక్రమంలో ధనుష్ పాల్గొనడాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ధనుష్‌ను అజయ్ దేవగన్ తీసుకొచ్చారు. అందులో మేమిద్దరం సన్నిహితంగా ఉంటూ మాట్లాడుకోవడమే ఈ ప్రచారానికి ప్రధాన కారణమైంది. నేను - ధనుష్ ప్రేమలో ఉన్నట్టు జరుగుతున్న ప్రచారాన్ని చూస్తుంటే నవ్వొస్తుందన్నారు.

రూ.100 కోట్ల క్లబ్‌కు చేరువలో 'తలైవన్ తలైవి'



'తలైవన్ తలైవి'లో నిత్యామేనన్ - విజయ్ సేతుపతి

'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి నటించిన 'తలైవన్ తలైవి' సినిమా రూ.100 కోట్ల క్లబ్‌కు చేరువకానుంది. గతంలో ఆయన నటించిన 'మహారాజా' చిత్రం రూ.100 కోట్లకుపైగా వసూలు చేసిన విషయం తెల్సిందే. ఇపుడు పాండిరాజ్ దర్శకత్వంలో నిత్యా మేనన్‌తో కలిసి నటించిన 'తలైవన్ తలైవి' చిత్రం కూడా ఆ దిశగా పరుగులు తీస్తోంది. ఈ సినిమా గత 16 రోజుల్లో రూ.89 కోట్ల మేరకు వసూలు చేసింది. మరోవైపు, ఈ చిత్రానికి ఇప్పటికీ థియేటర్ కలెక్షన్లు బాగానే ఉన్నాయి. దీంతో ఈ వారాంతానికి రూ.100 కోట్ల కలెక్షన్లు అధిగమించవచ్చని మేకర్స్ భావిస్తున్నారు. కాగా గతంలో నితిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో వచ్చిన 'మహారాజా' మూవీ ఘన విజయం సాధించడంతో పాటు రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టిన విషయం తెల్సిందే.

మెడికల్ క్రైం థ్రిల్లర్‌గా 'అదర్స్'



'అదర్స్'లో ఆదిత్య మాధవన్ - గౌరి కిషన్

ఆదిత్య మాధవన్ - గౌరి జి కిషన్ జంటగా 'అదర్స్' పేరుతో మెడికల్ క్రైం థ్రిల్లర్ మూవీ తెరకెక్కింది. ఇందులో ఆదిత్య పోలీస్ ఆఫీసర్‌గా, హీరోయిన్ గౌరి వైద్యురాలిగా నటించారు. ఈ మూవీ ఫస్ట్ లుక్ తాజాగా రిలీజ్ చేయగా, ఇది ప్రతి ఒక్కరిని ఆకర్షిస్తోంది. ఇతర పాత్రల్లో అంజు కురియన్, మునీష్‌కాంత్, హరీష్ పేరడి, మాల పార్వతి, జగన్, ఆర్.సుందరరాజన్ తదితరులు నటించారు. అప్ 7 వెంచర్స్, గ్రాండ్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రానికి అభిన్ హరిహరన్ దర్శకుడు. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను దర్శకుడు వెంకట్ ప్రభు, హీరో ఆర్య, హీరోయిన్లు ఆండ్రియా, ఐశ్వర్య రాజేష్, వాణి భోజన్, గీత రచయిత వివేక్ సహా పలువు కోలీవుడ్ సెలెబ్రిటీలు తమతమ సామాజిక మాధ్యమాల్లో రిలీజ్ చేశారు. చెన్నై సహా నగర శివారు ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబరులో విడుదల చేయనున్నారు.



వాౖప్రేమ హస్తం

తిరుపతి
ఆంధ్రజ్యోతి

ఎడమచేతి వాటం కలిగిన వారిని ఒకప్పుడు పుర్రచెయ్యోడు, లొడ్డోడు.. అని ఎగతాళి చేసేవారు. ఎడమచేతిని వాడడం ఏ రకంగానూ లోపం కాదు. అయినా ఇప్పటికీ కుటుంబాల్లో కూడా ఎంతో కొంత గాయపడే మాటలు విసురుతూనే ఉంటారు. బలవంతంగా కుడి చేతిని వాడాలని వేధిస్తుంటారు. ఆడా, మగా సమానం అన్నట్టే.. కుడి, ఎడమల్లోనూ తేడా లేదు. ఒకటి బలమైనది, మరొకటి బలహీనమైనది కానేకాదు. ఏది ఎక్కువగా వాడితే అది ఆ పనులకు అలవాటవుతుంది అంతే. ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఎడమ చేతివాటం వారని అంచనా. ఎడమచేతి వివక్షను సమాజంలో పోగొట్టాలనే ఉద్దేశ్యంతో నేడు లెఫ్ట్‌హ్యాండర్స్‌డే జరుపుకుంటున్నారు.

లెఫ్ట్ హ్యాండర్స్ అనుకూలతలు

- బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో కుడిచేతి వారికంటే త్వరగా ఎడమచేతివారు కోలుకుంటారు.
- క్రీడాకారులకు ప్రయోజనం ఎక్కువ
- టైపింగ్‌లోనూ వేగం, ● మెదడులోని ఎడమ, కుడి భాగాలతో మెరుగైన అనుసంధానం
- పార్కిన్‌సన్స్ వ్యాధి వచ్చే అవకాశాలు తక్కువ.
- నీటిలోపల చూసే సామర్థ్యం ఎక్కువ.



సర్జరీల్లోనూ సమస్య లేదు

చిన్నతనం నుంచి నాకు ఎడమ చేతివాటమే. ఎక్కడా ఇబ్బంది రాలేదు. యాదృచ్ఛికమే అయినా నా భర్త డాక్టర్ హరిబాబుది కూడా ఎడమ చేతివాటమే. ఆయన చిత్తూరు అపోలో హాస్పిటల్‌లో ఆర్థోపెడిక్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. సర్జరీల్లో మాకు ఎప్పుడూ ఏ సమస్యా రాలేదు. ఏ తేడా అనిపించలేదు.

- డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి




ఎడమచేతిని అడ్డుకోవద్దు

కుడి చేత్తో రాయడంవల్ల మెదడులోని ఎడమ అర్ధగోళం (భాష, లాజిక్ పనిచేసే ప్రదేశం) పని చేస్తుంది. ఎడమ చేత్తో రాయడం వల్ల కుడి అర్ధగోళం (సృజనాత్మకత, స్పేస్ అవగాహన గల ప్రదేశం) పని చేస్తుంది. అదే రెండింటినీ ఉపయోగించడం వల్ల కార్పస్ కాలోసమ్ (రెండు అర్ధగోళాలను కలిపే సేతు) బలపడుతుంది. చేతుల కదలికలను నియంత్రించే మెదడు భాగం కొత్త కదలికలను నేర్చుకుంటుంది. ఈకొత్త న్యూరల్ కనెక్షన్లు కొత్త పనికి అలవాటు పడే క్రమంలో కొత్త విషయాలను వేగంగా నేర్చుకునే సామర్థ్యం పెరుగుతుంది. రెండు చేతుల సమన్వయం మెరుగవుతుంది. టైపింగ్, సంగీత వాయిద్యాలు వాయించడం, ఆటల్లో చురుకుదనం, వేగం పెరుగుతాయి. పిల్లలు ఎడమ చేయి వాడుతుంటే అడ్డుకోవద్దు. వీలైతే రెండు చేతులూ వాడేలా ప్రోత్సహించండి.

- భాస్కర్ రాజు, మేక్‌మైబేబీ జీనియస్ వ్యవస్థాపకుడు

సవ్యసాచి సంగరాజు



కుడి, ఎడమ తేడా లేదని నిరూపిస్తున్నారు సంగరాజు అశ్విని. రెండు చేతులతోనూ ఆమె ఒకే వేగంతో రాయగలరు. ఇంకా విశేషం ఏమిటంటే ఒకేసారి కుడిచేత్తో ఒక భాష, ఎడమ చేత్తో మరో భాషలో రాయడం. అక్షరాల అందంలోనూ కుడిచేతికీ, ఎడమ చేతికీ తేడా ఉండదు. ప్రస్తుతం తిరుపతిలోని మేక్‌మైబేబీ జీనియస్ స్కూల్ డైరెక్టర్‌గా ఉన్న అశ్విని..ఎడమచేతిని వాడే తమ విద్యార్థుల్లో న్యూనతను పోగొట్టడానికి తాను రాసి చూపిస్తుంటారు.

టీటీడీ విరాళంగా బ్యాటరీ బుగ్గీలు






టీటీడీకి మంగళవారం రెండు బ్యాటరీ బుగ్గీలు విరాళంగా అందాయి. బెంగుళూరుకు చెందిన చంద్రశేఖర్ అనే భక్తుడు రూ.11 లక్షలు విలువైన ఈ బ్యాటరీ వాహనాలను అందజేశారు. ఆలయం ముందు పూజలు చేసి, వాహనాల తాళాలను ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

15నుంచి ఆడికృత్తిక ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా తిరుత్తణికి మూడు రోజుల పాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. 222 (15న 65, 16న 88, 17న 69) బస్సులతో తిరుత్తణికి, అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో గమ్యస్థానాలకు చేరవేయనున్నట్లు డీపీటీవో జగదీష్ ఓ ప్రకటనలో కోరారు. బస్సుల వివరాలిలా... ● తిరుపతి-తిరుత్తణి వయా నగరి - శుక్రవారం 4, శనివారం 5, ఆదివారం 5 ● అదేవిధంగా పచ్చికాపల్లం-తిరుత్తణి వయా నగరి 10, 20, 10 ● పుత్తూరు-తిరుత్తణి వయా పల్లిపట్టు 4, 6, 4 ● పుత్తూరు-తిరుత్తణి వయా నగరి 12, 12, 12 ● నగరి-తిరుత్తణి 5, 5, 5 ● కొత్తపల్లిమిట్ట-తిరుత్తణి వయా నగరి 10, 15, 15 ● సత్యవేడు-తిరుత్తణి వయా నాగలాపురం 10, 15, 10 ● నాగలాపురం-తిరుత్తణి 5, 5, 5 ● తిరుపతి-పాకాల - శుక్రవారం 5, శనివారం 5, ఆదివారం 3 చొప్పున బస్సులు నడుస్తాయి.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.84 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,740
తలనీలాలు సమర్పించినవారు: 34,958


ప్రాణాలను నిలబెడదాం

రాజంపేటకు చెందిన 15ఏళ్ల స్పందనకు గుండె మార్పిడి చేయకపోతే ప్రాణాలకు ముప్పు వస్తుందని వైద్యులు తెలిపారు. కూలీ పనులు చేసుకునే ఆమె తల్లిదండ్రులు తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయను ఆశ్రయించారు. వైద్యులు వెంటనే బాలిక వివరాలను జీవన్‌ధాన్ పోర్టల్‌లో నమోదు చేశారు. నెలరోజుల తర్వాత గుంటూరుకు చెందిన ప్రసాద్(40) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అతని గుండెను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. హృదయాలయ వైద్యులు గుంటూరు వెళ్లి ప్రసాద్ గుండెను ఆగమేఘాలపై సేకరించారు. స్పందనకు అమర్చారు. ఇప్పుడు ఆ బాలిక చదువు కొనసాగిస్తోంది.



పూతలపట్టు మండలం సామనత్తంకు చెందిన బీటెక్ విద్యార్థి గొల్లపల్లి హేమకుమార్(24) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. అతని తల్లిదండ్రులు తమ బిడ్డ అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో వైద్యులు గుండెను పద్మావతి హృదయాలయానికి తరలించి 29 ఏళ్ల వ్యక్తికి అమర్చారు. గంగవరం మహిళకు కాలేయం, పూతలపట్టు మహిళకు కిడ్నీని అమర్చారు. ఒక వ్యక్తి అవయవాలు ముగ్గురి ప్రాణాలను నిలబెట్టింది.

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మరణించినా మరొకరిలో జీవించి ఉండాలంటే అయయవదానమొక్కటే మార్గం. పెద్ద మనసుతో స్పందిస్తే మరికొంతమంది ప్రాణాలను నిలపవచ్చు. అయితే అవయవదానంపై చాలామందికి సరైన అవగాహన లేదు. పైగా సెంటిమెంట్లు, అపోహలు తోడవుతున్నాయి. ఫలితంగా మరొకరి ప్రాణాలు నిలబెట్టే అవయవాలు మట్టిలో కలిసి పోతున్నాయి. ఒకప్పుడు ప్రధాన అవయవాలు చెడిపోతే మరణం తప్ప గత్యంతరంలేదు. ఇప్పుడు వైద్యరంగంలో వచ్చిన అధునాతన మార్పులతో అవయవాల మార్పిడి ద్వారా ఎందరో ప్రాణాలను నిలబెడుతున్నారు. ఎదురవుతున్న చిక్కల్లా ఎక్కువ మంది దాతలు ముందుకు రాకపోవడమే. వెంటాడుతున్న అవగాహనారాహిత్యమే.



గుంటూరులో దాత నుంచి సేకరించిన గుండెను పద్మావతి చిన్నపిల్లల హృదయాలయకు తీసుకు వస్తున్న వైద్యుడు

world organ donation day

అవయవదానంతో మరికొందరికి పునర్జన్మ

నేడు అవయవదాన దినోత్సవం

అవరోధంగా మారుతున్న అవగాహనారాహిత్యం

జీవన్‌ధాన్ పోర్టల్‌లో వివరాలు నమోదు

బ్రెయిన్ డెత్, లేదా ఇతర కేసుల్లో అవయవాలను దానం చేసేందుకు దాతలు ముందుకు వస్తే గ్రహీతలకు అందించేందుకు ప్రభుత్వం జీవన్‌ధాన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. గుండె, లివరు, కిడ్నీ వంటి ప్రధాన అవయవాలు పాడైన వారి వివరాలను ఇందులో నమోదు చేసుకుంటున్నారు. దాత దొరికితే జీవన్‌ధాన్ పోర్టల్లో బాధితులకు సమాచారమిస్తున్నారు. వెంటనే ఆ అవయవాలను మార్చి బాధితుల ప్రాణాలు నిలబెడుతున్నారు. పోర్టల్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే మొదట అవకాశం కల్పిస్తుండటం, మిగిలిన వారికి దాతలు దొరికే వరకు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండటంతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతి పది నిముషాలకు ఒకరు పోర్టల్ జాబితో చేరుతుండగా, నమోదు చేసుకున్న వారిలో రోజుకు 20 మందికి పైగా ప్రాణాలు విడుస్తున్నట్లు సమాచారం. పది శాతం మందిని మాత్రమే అవయవ మార్పిడితో రక్షించగలుగుతున్నారు.అవయవదానంపై అవగాహన లోపం కారణంగానే ఇలాంటి పరిస్థితి దాపురిస్తోంది.

మన జిల్లాలో ఇలా..

- తిరుపతిలోని టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 20 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగాయి. వీరిలో మూడు నెలల చిన్నారుల నుంచి 55 ఏళ్ల వయసున్న వారు కూడా ఉన్నారు.
- ఏడాది కిందట స్విమ్స్‌లో బ్రెయిన్ డెడ్‌కు గురైన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో ముగ్గురి ప్రాణాలు నిలబెట్టారు.
- కుటుంబ సభ్యులతో అనుమతితో మృతుల కళ్లను రుయాస్పత్రి ఐ-బ్యాంక్ సేకరిస్తోంది. మరణానంతరం కళ్ల దానం చేసేందుకు ముందుకు వచ్చే వారి వివరాలను కూడా నమోదు చేసుకుంటున్నారు. సేకరించిన కళ్లను అవసరమైన వారికి అమర్చి వెలుగులు నింపుతున్నారు.

వీరి అవయవాలు దానం చేయవచ్చు

వివిధ సంఘటనల్లో బ్రెయిన్ డెడ్‌కు గురైన వారి అవయవాలన్నీ ఇతరులకు ఉపయోగపడతాయి. వైద్యుల పర్యవేక్షణలో మరణించిన వారివి కూడా కొన్ని అవయవాలు ఉపయోగపడతాయి. జీవించి ఉన్న వారు కిడ్నీ, కాలేయం వంటి అవయవాలను ఇవ్వవచ్చు. ఒకరి నుంచి సేకరించిన గుండె, కిడ్నీ, లివర్, కళ్లు, ఊపిరితిత్తులు, చిన్నపేగులతో ఎనిమిది మందికి పునర్జన్మ కలుగుతుంది. తీవ్రమైన అంటు వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిక్‌తో అధికంగా బాధపడే వారి అవయవాలు పనికిరావు.



అవగాహన పెరగాలి

మరణించాక శరీరంతోపాటు అవయవాలను మట్టిలో కలిసిపోనీయకుండా కుటుంబ సభ్యులు ముందుకు రావాలి. గుండె మార్పిడి కోసం అనేక మంది ఎదురు చూస్తున్నారు. బ్రెయిన్‌డెడ్‌కు గురైన వారి అవయవాలను ఇటువంటి వారికి దానం చేస్తే ప్రాణాలు నిలబెట్టవచ్చు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహనతో స్పందించాలి.

- డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్



8 మందికి పునర్జన్మ

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో 8మంది ప్రాణాలను రక్షించవచ్చు. ఒకప్పుడు కిడ్నీ, లివర్ వంటివి మార్పిడీ చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం గుండెను సైతం మార్చుతున్నారు. కిడ్నీ, లివర్ వంటి అవయాలను దానం చేసేందుకు ఆరోగ్యవంతులైన వారు అర్హులు. ఒక కిడ్నీ, లివర్‌లో కొంత భాగం దానం చేశాక కూడా మామూలుగా బతకవచ్చు. అవయవదానానికి మించిన దానం మరొకటి లేదు.

- డాక్టర్ పీవీ రజనీకాంత్, లివర్ ట్రాన్స్‌ప్లాంటర్









బహుమతి పొందిన వాటిలో లావణ్య, కుమార్ తీసిన ఫొటోలు

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

తిరుపతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ డేని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ (ఏపీపీజేఏ) నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో తిరుపతి ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు ఆర్.లావణ్య కుమార్, కె.సాయికుమార్‌లకు బహుమతులు లభించాయి. స్పాట్‌న్యూస్ ఫొటో విభాగంలో లావణ్యకుమార్ తీసిన కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుల ఫొటోకు అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. జనరల్ విభాగంలో తిరుమల నడకదారిలో ఐసు తింటున్న ఉడుత ఫొటో తీసిన సాయికుమార్‌కు అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించారు. ఆగస్టు 19న విజయవాడలో జరగనున్న వేడుకలో వారు అవార్డులు అందుకోనున్నారు.

షార్ డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): షార్ కొత్త డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి షార్ నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కోరారు. ఆమెతో పాటు నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, మాధవనాయుడు, సెల్వం తదితరులున్నారు.

రుయాస్పత్రికి క్యాత్‌ల్యాబ్ మంజూరు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న గుండె సంబంధిత వ్యాధుల బాధితుల కోసం ప్రభుత్వం రుయాస్పత్రికి క్యాత్‌ల్యాబ్‌ను మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న రోజుల్లో రుయాస్పత్రి మెరుగైన గుండె వైద్యాన్ని పీపీపీ(పబ్లిక్ ప్రవేటు పార్టనర్‌షిప్) పద్ధతిలో అందించనుంది.

హెచ్‌డీపీటీ ఛైర్మన్‌గా దాసరి శ్రీనివాసులు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ) ఛైర్మన్‌గా బీజేపీ నేత, తిరుపతికి చెందిన దాసరి శ్రీనివాసులును రాష్ట్ర ప్రభుత్వ నియమించింది. ఏపీలో 31 నామినేటెడ్ పదవులను భర్తీచేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి అయిన దాసరి శ్రీనివాసులుకు ఈ పదవి దక్కింది. హిందూ ధర్మ పరిరక్షణార్థం మాజీ ఐఏఎస్ అధికారి పీవీఆర్కే ప్రసాద్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖకు అనుబంధంగా హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అంతటి ప్రతిష్టాత్మక ట్రస్ట్‌కు ఛైర్మన్‌గా నియమితులవడంపట్ల దాసరి శ్రీనివాసులు ఆనందం వ్యక్తం చేశారు.

మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా బొమ్మన శ్రీధర్



తడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా తడ మండలానికి చెందిన మత్స్యకార నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది. టీడీపీ ఆవిర్భావం నుంచి బొమ్మన కుటుంబం పార్టీలో కొనసాగుతోంది. శ్రీధర్ తండ్రి బొమ్మన సుందరయ్య మత్స్యకార గ్రామాల్లో టీడీపీ పటిష్టతకు ఎంతో కృషి చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో కేసులను ఎదుర్కొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రలతో మెరుగైన ఆరోగ్యం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో నులిపురుగు నివారణ(ఆల్బెండజోల్) మాత్రలు దోహదపడతాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా మంగవారం తిరుపతి నగరం కొర్లగుంటలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1-19 ఏళ్లలోపు ఉన్న 4,97,511 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన పలువురు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఐవో కుమార్, అధికారులు డాక్టర్ శ్రీనివాసవర్మ, డాక్టర్ సౌజన్యలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసులు, రెడ్డిప్రసాద్, కిరణ్‌కుమార్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్న కలెక్టర్



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో సతీష్‌బాబు, ఉపాధ్యాయులు

● ఉపాధ్యాయుల చొరవతో

నిరుపేద పిల్లల బడిబాట

ఎర్రావారిపాలెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇటుక బట్టీలో పని చేసే నిరుపేద దంపతులకు చెందిన ఇద్దరు పిల్లలను బడిబాట పట్టించడంలో ఎంఈవో, ఉపాధ్యాయుల శ్రద్ధ ఫలించింది. నెరబైలు పంచాయతీ తలకోన దారిలోని ఓ ఇటుక బట్టీలో పనిచేసేందుకు మూడు యానాది కుటుంబాలు వలస వచ్చాయి. వీరిలో గుండ్రాతి కుప్పం నాగరాజు, ధనలక్ష్మి దంపతులకు ఐదుగురు పిల్లలున్నారు. వీరిలో శ్రీనివాసులు, ముకేష్‌కు ఐదేళ్లు దాటినా పాఠశాలకు పంపలేదు. ఈ క్రమంలో మంగళవారం ఎంఈవో-2 సతీష్‌బాబు నెరబైలు మండల పరిషత్ మోడల్ స్కూల్‌కు తనిఖీకి వచ్చారు. బడికి రాని పిల్లల గురించి ఆరా తీశారు. సమీపంలోని ఇటుకబట్టీలో కూలీల పిల్లలు స్కూలులో చేరలేదని తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, టీచర్లతో కలిసి ఇటుక బట్టీ వద్దకు వెళ్లారు. ఉపాధ్యాయులను చూసిన పిల్లలు దూరంగా చెట్లచాటున దాక్కున్నారు. నాగరాజు, ధనలక్ష్మి దంపతులతో ఉపాధ్యాయులు మాట్లాడారు. పిల్లలకు ఆధార్ కార్డు లేదని వాళ్లు చెప్పగా.. తండ్రికి ఆధార్ కార్డు ద్వారా పిల్లలకు తామే ఇప్పిస్తామని ఎంఈవో తెలిపారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలిద్దరినీ స్కూలుకు పంపేందుకు అంగీకరించారు. వెంటనే శ్రీనివాసులు, ముఖేష్‌కు మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ప్రవేశం కల్పించారు. పిల్లలకు దుస్తులనూ ఉపాధ్యాయులే సమకూర్చారు.



టీచర్లను చూసి చెట్టు చాటున దాక్కున్న పిల్లలు